ప్రజాశక్తి

గురువారం 10 అక్టోబర్ 2024

5

పార్వతీపురం మన్యం

అంతర్జాతీయ స్థాయి పోటీలకు పైడిరాజు

ప్రజాశక్తి-సాలూరు రూరల్

సాలూరు మండలంలోని మామిడిపల్లికి చెందిన కనకల పైడిరాజు ఈ నెల 10 నుంచి 19 వరకు మలేషియాలో జరిగే అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్‌లో 200, 400, 800 మీటర్ల పరుగు పందెంలో ఆమె బంగారు పతకం సాధించింది. పైడిరాజు గతంలో శ్రీలంకలో జరిగిన అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచింది. ప్రస్తుతం విశాఖపట్నంలోని గీతం డెంటల్ కాలేజీలో ఎఎన్‌ఎంగా పైడిరాజు పనిచేస్తోంది. గీతం కళాశాల యాజమాన్యం ఆమెకు పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నట్లు ఆమె చిన్ననాటి కోచ్ పి.శ్రీరాములు తెలిపారు.

మాజీల భవిష్యత్తు.. అధిష్టానం గుప్పెట్లో

టిడిపి అధిష్టానం గుప్పెట్లో పార్వతీపురం నియోజకవర్గ మాజీల భవిష్యత్తు ఉందా? అంటే ఆ పార్టీ శ్రేణుల నుంచి అవుననే సమాధానమే వినిపిస్తోంది. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్న వారి నుంచీ ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అందుకు కారణాలు లేకపోలేదు. మాజీలపై ఇటీవల పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర అధిష్టానానికి ఫిర్యాదు చేసేంత వరకూ పరిస్థితి వెళ్లింది. గత సార్వత్రిక ఎన్నికల నుంచి ఇప్పటివరకు నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ.. ఇద్దరూ అంటీముట్టనట్లు వ్యవహరిస్తుండటం, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటూ వస్తుండటం కూడా అందులో భాగమేనని బోగట్టా. కానీ అధిష్టానం ఇంకా సంశయంలో ఉన్నట్లు సమాచారం. అధిష్టానం తీసుకునే నిర్ణయాన్ని బట్టి వారి భవిష్యత్తు ప్రయాణం ఉండవచ్చనే చర్చ నడుస్తోంది.



- పార్టీ కార్యక్రమాలకు దూరంగా ద్వారపురెడ్డి, బొబ్బిలి
- సస్పెండ్ చేయాలని ఎమ్మెల్యే ఫిర్యాదు
- ఆచితూచి అడుగులేస్తున్న టిడిపి నాయకత్వం

ప్రజాశక్తి-పార్వతీపురం

టిడిపి అధికారంలోకి వచ్చిన వేళ పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. గత ఎన్నికల్లో వీరిద్దరూ టిడిపి గెలుపు కోసం పని చేయలేదన్న నివేదికలు పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు వద్ద ఉన్నాయనే ప్రచారం సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర కూడా వీరిద్దరిపై అధిష్టానానికి నివేదిక అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌ను, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కూడా ఆయన కోరినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆయన తన అనుచరులతో కలిసి టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. అయితే పార్టీ అధిష్టానం కూడా వీరిద్దరిపై చర్యలు తీసుకోవడానికి తటపటాయిస్తోందనే వాదనలు వినిపిస్తున్నాయి.

జిల్లాకే పెద్దదిక్కుగా..

పార్వతీపురం మన్యం జిల్లాలో బలమైన బిసి సామాజిక తరగతికి చెందిన సీనియర్ నాయకుడు ద్వారపురెడ్డి జగదీష్. ఆయన ఎమ్మెల్సీగా, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షులుగా పని చేశారు. పార్టీ తరపున ప్రతినిధిగా అప్పుడప్పుడు టీవీ ఛానెళ్లలో నిర్వహించే చర్చల్లో పాల్గొంటారు. అలాంటి సీనియర్ నేతని పార్టీ ఎలా వదులుకుంటుందనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. సమీప భవిష్యత్తులో మున్సిపల్, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలు కూడా రానున్నాయి. ద్వారపురెడ్డి స్థానాన్ని భర్తీ చేసే సీనియర్ బిసి నాయకుడు ప్రస్తుతం జిల్లాలోని టిడిపిలో కనిపించడం లేదు. ఇక మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మొదటి నుంచి మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డికి విధేయుడిగా వ్యవహరిస్తున్నారు. ఆయన ఒకసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. చిరంజీవులు దళిత నాయకులు. ఎమ్మెల్యే విజయ్‌చంద్ర ఫిర్యాదు మేరకు అధిష్టానం వీరిద్దరిపై చర్యలు తీసుకుంటుందా? లేదా? అన్నది తేలాల్సి ఉంది.

అప్పటివరకూ వేచిచూడాల్సిందే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు కావస్తోంది. ఇంతవరకు జరిగిన పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో వీరిద్దరూ ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ కార్యకలాపాలకు దూరంగానే ఉంటున్నారు. అధిష్టానం నిర్ణయాన్ని బట్టి ఈ మాజీలిద్దరూ అడుగులు వేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో పార్టీకి వ్యతిరేకంగా పని చేసిన నాయకులపై ఫిర్యాదులున్నాయి. పార్టీకి వ్యతిరేకంగా పని చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొంతమంది నాయకులు ఇప్పటికే ప్రత్యామ్నాయ దారులు వెతుక్కొనే పనిలో నిమగ్నమయ్యారు. సాలూరు నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకుడు పెంట తిరుపతిరావు ఇటీవల జనసేనలో చేరిపోయారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి వ్యతిరేకంగా ఆయన గత ఎన్నికల్లో పని చేశారు. మంత్రి సంధ్యారాణితో పొసగదనే నిర్ణయానికి వచ్చిన పెంట తిరుపతిరావు జనసేన తీర్థం పుచ్చుకున్నారు. ఇక మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ కూడా కూటమి పార్టీల్లో ఏదో ఒక దానిలో చేరతారనే టాక్ నడుస్తోంది. ఏదేమైనా టిడిపి అధిష్టానం మాజీల విషయంలో తీసుకోబోయే చర్యలను బట్టి ద్వారపురెడ్డి, బొబ్బిలి ప్రయాణం ఉండొచ్చునని స్పష్టంగా కనిపిస్తోంది.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

మున్సిపాలిటీలో ఫర్నిచర్ మాయం

శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌పై అనుమానం • విచారణ చేపట్టాలని కార్మికుల డిమాండ్

ప్రజాశక్తి-సాలూరు

మున్సిపాలిటీలో విలువైన ఫర్నిచర్ మాయమైంది. దీని విలువ లక్ష రూపాయలపైనే ఉంటుందని భావిస్తున్నారు. 2013లో ప్రత్యేక అధికారి పాలనలో మున్సిపల్ పారిశుధ్య విభాగం కార్యాలయాన్ని ఆనుకుని విశ్రాంతి గదిని ఏర్పాటు చేశారు. పట్టణానికి వచ్చిన జిల్లా, ఇతర ఉన్నతాధికారులకు సరైన విశ్రాంతి భవనం లేకపోవడంతో అప్పటి కమిషనర్ పారిశుధ్య విభాగం గదిలో రెండు దివాన్ కాట్‌లు, ఒక బెడ్, విలువైన కుర్చీలు ఏర్పాటు చేశారు. ఈ ఫర్నిచర్ గత కొద్దిరోజులుగా కనిపించడం లేదనే ప్రచారం సాగుతోంది. ఇటీవల బదిలీపై వెళ్ళిన శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు మాయం చేశారని సాక్షాత్తు మున్సిపల్ కార్మికులే ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ పకీర్‌రాజు బదిలీపై పార్వతీపురం మున్సిపాలిటీకి వెళ్లారు. ఆయన ఇక్కడ పనిచేస్తున్నంత కాలం ఈ వ్యవహారాన్ని గుట్టుగా దాచిపెట్టి ఉంచినట్లు తెలుస్తోంది. విలువైన ఫర్నిచర్ మాయం కావడంతోపాటు పారిశుధ్య విభాగానికి సంబంధించిన ఐరన్ స్క్రాప్ కూడా కనిపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాయమైన ఫర్నిచర్ వ్యవహారంపై విచారణ చేపట్టాలని కోరుతూ బుధవారం మున్సిపల్ కార్మికులు నిరసన చేపట్టారు. అనంతరం ప్రస్తుత ఇన్‌ఛార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాజీవ్‌కి వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు టి.రాముడు, వెంకటరావు, కూర్మారావు, శంకరావు పాల్గొన్నారు.

విశ్రాంతి గదిలో మాయమైన సామగ్రి

గంజాయి రవాణాపై కఠిన చర్యలు

డిఐజి గోపీనాథ్ జెట్టి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

విశాఖ రేంజ్ పరిధిలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టాలని డిఐజి గోపీనాథ్ జెట్టి అన్నారు. బుధవారం రేంజ్ పరిధిలోని అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల ఎస్‌పిలతో జూమ్ మీటింగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేంజ్ పరిధిలో ఎక్కడా గంజాయి సాగు జరగకుండా చూడాలని, గంజాయి పండించే రైతులు తమ జీవనోపాధికి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి సాగు, విక్రయాలు, రవాణా, వినియోగం చేయడం వల్ల విధించే శిక్షలు, ఎదుర్కొనే న్యాయపరమైన చిక్కులను వివరించాలన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రజలు, విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు 'సంకల్పం' కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రతీ జిల్లాలో గంజాయి అక్రమ రవాణా నియంత్రణకు మరింత పటిష్టంగా డైనమిక్ వాహన తనిఖీలను ఆకస్మికంగా చేపట్టాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణాకు తరుచూ పాల్పడే వారిపై పీడీ యాక్టును ప్రయోగించాలన్నారు. గంజాయి కేసుల్లో పరారీలో ఉన్న నిందితులను అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అరెస్టు చేయాలని ఎస్‌పిలను ఆదేశించారు. దీపావళి పండగ వస్తున్న నేపథ్యంలో బాణసంచా విక్రయించే షాపులు, గోడౌన్లను తనిఖీ చేసి, వారి లైసెన్సులు పరిశీలించాలని చెప్పారు. జూమ్ కాన్ఫరెన్సులో ఎస్‌పిలు ఎస్.వి. మాధవ్ రెడ్డి, ఎం.దీపిక, అమిత్ బర్దర్, వకుల్ జిందాల్, కె.వి.మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని

గ్రీన్ అంబాసిడర్ల ధర్నా

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలు పరిష్కరించాలని బుధవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యాన గ్రీన్ అంబాసిడర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్లకు ఏడాది కాలంగా సక్రమంగా వేతనాలు చెల్లించడం లేదన్నారు. గతంలో స్వచ్ఛ ఆంధ్ర మిషన్ ద్వారా వేతనాలు చెల్లించే వారని, వీరి జీతాల బాధ్యత పంచాయతీలకు అప్పజెప్పిన తర్వాత కష్టాలు మొదలయ్యాయని చెప్పారు. పంచాయతీల్లో నిధులు లేవనే కారణం చూపి జీతాలు చెల్లించడం లేదన్నారు. ఇలా అయితే వారి కుటుంబాలను ఎలా పోషించుకోగలరని ఆవేదన వ్యక్తంచేశారు. కొన్ని పంచాయతీల్లో సగం వేతనం చెల్లించి, చేతులు దులుపుకుంటున్నారని వాపోయారు. వీరి రక్షణకు ఎలాంటి ఇన్సూరెన్స్ లేదని, పని భద్రత లేదని, గ్లౌజులు, కొబ్బరినూనె, సబ్బులు లాంటివి సరఫరా చేయడం లేదని వివరించారు. అనంతరం డిఆర్‌ఒకు వినతి అందించారు. డిఆర్‌ఒ స్పందిస్తూ తక్షణమే పరిష్కారానికి ఎంపిడిఒ, డిపిఆర్‌ఒలకు చెబుతామని, అందరికీ జీతాలు చెల్లిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు గవర వెంకటరమణ, గౌరి, పాండా, నల్లయ్య, నూకయ్య తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ ఏది?

నిరుద్యోగ యువత ఎందుకు ప్రశ్నించడం లేదు : మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర

ప్రజాశక్తి-సాలూరు

ఎన్నికల ముందు నిరుద్యోగ యువతకు ఇచ్చిన జాబ్ కేలండర్ హామీని టిడిపి కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ప్రశ్నించారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జాబ్ కేలండర్ విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కూటమి పార్టీలు ఇప్పుడు ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. అధికారం చేపట్టి నాలుగు నెలలు కావస్తున్నా నిరుద్యోగ యువత ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. వైసిపి ప్రభుత్వం జాబ్ కేలండర్ విడుదల చేసి, చెప్పిన విధంగానే ఉద్యోగాల భర్తీ చేసి చూపిందని తెలిపారు. 2023లో గ్రూప్-1, 2 ఉద్యోగాల భర్తీకి అప్పటి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని చెప్పారు. వాటికి సంబంధించిన ప్రిలిమినరీ పరీక్షలు కూడా నిర్వహించినట్లు చెప్పారు. 2024 జులైలో గ్రూప్-1, సెప్టెంబర్‌లో గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు నిర్వహించాల్సి ఉన్నా టిడిపి ప్రభుత్వం జాప్యం చేస్తోందని చెప్పారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఈపాటికి ఉద్యోగాల భర్తీ పూర్తయ్యేదన్నారు. గత ప్రభుత్వం హయాంలో నే అటవీశాఖలో 600 ఉద్యోగాలు, పోలీస్ శాఖలో వేలాది ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు జారీ చేసిందని తెలిపారు. ఆ ఉద్యోగాలు కూడా ఇంతవరకు భర్తీ చేయలేదని విమర్శించారు. మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను తమ ప్రభుత్వం విడుదల చేసినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో ఆరువేల పోస్టులు కలిపి 16 వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసిందని తెలిపారు. ఎన్నికల ముందు టిడిపి కూటమి నాయకులు 50వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారని, ఇప్పుడు ఎందుకు చేయలేదని రాజన్నదొర నిలదీశారు.

వెలుగు ఎపిడిపై విచారణ చేపట్టాలి

ఐటిడిఎ పిఒకు సిపిఎం ఫిర్యాదు

ఐటిడిఎ పిఒకు వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు సాంబమూర్తి

ప్రజాశక్తి-పార్వతీపురం

ఐటిడిఎ పరిధిలో వెలుగు ఎపిడిగా వై.సత్యంనాయుడు పని చేసిన కాలంలో ప్రభుత్వం నుంచి మంజూరైన నిధులు, కార్యాలయాలకు కొనుగోలు చేసిన వివిధ సామగ్రిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవకు సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి బుధవారం ఫిర్యాదు చేశారు. విచారణ చేపడతామని ఐటిడిఎ పిఒ హామీ ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎలో కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న వెలుగు ఎపిడి సత్యంనాయుడు పలు అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు, వివిధ మండల కార్యాలయాల నిర్వహణ కోసం కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయని తెలిపారు. ఐటిడిఎ పరిధిలో 58 వన్‌ధన్ కేంద్రాలు నిర్వహించడంలో ఇష్టానుసారంగా వ్యవహరించడంతో ఎక్కువగా అటవీ ఉత్పత్తులు గిరిజన మహిళలు ప్రాసెసింగ్ చేసుకోవడానికి వీలు లేకుండా తీవ్ర నష్టం జరిగిందని తెలిపారు. దీనివల్ల గిరిజన మహిళలు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పాడేరు నుండి 8 టన్నుల పసుపు కొనుగోలు చేశారని, ఇక్కడ పసుపు ఉత్పత్తి అవుతున్నప్పుడు పాడేరు నుంచి కొనుగోలు చేసిన పసుపు ఎన్ని కేంద్రాలకు సరఫరా చేశారనేది తేల్చాలని డిమాండ్ చేశారు. చింతపండు ప్రాసెసింగ్ మిషన్ల కొనుగోళ్లలో కూడా అవినీతి జరిగిందన్నారు.

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.3.20 కోట్లలో ఐటిడిఎ పరిధిలోని ఎనిమిది మండలాల్లో 58 వన్‌ధన్ కేంద్రాల ద్వారా 36 మహిళ గ్రూపులకు 15 లక్షలు రూపాయలు చొప్పున ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ఆ నిధులు ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి నెలకొందని, వీటిపై కూడా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మండలంలో సుమారు 60 లక్షల రూపాయల వరకు విఒఎలు, సిసిలు, కొంతమంది ఎపిఎంలు దుర్వినియోగం చేయడంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు సంబంధించి కమీషన్ డబ్బులు మహిళా సంఘాలకు చెల్లించలేదని చెప్పారు. ఎపిడి సత్యంనాయుడు కింద స్థాయి సిబ్బందిని ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారు.

గర్భిణుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు

గర్భిణులకు భోజనం వడ్డిస్తున్న డివిజి శంకరరావు

ప్రజాశక్తి-మక్కువ

గర్భిణుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చూపించరాదని రాష్ట్ర ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు అన్నారు. బుధవారం శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. స్థానికంగా గర్భిణులకు అందుతున్న వైద్యసేవలపై డాక్టర్ కిరణ్ కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. సరైన పౌష్టికాహారం తీసుకోవాలని, వైద్యుల సలహాలు పాటించాలని వారికి వివరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన ఆసుపత్రి భవనాన్ని పరిశీలించారు. ఇటీవల మృతి చెందిన అఖ్యాన సూర్యనారాయణ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అఖ్యాన తిరుపతిరావు నివాసానికి వెళ్లారు. ఈ కార్యక్రమంలో శంబర ఎంపిటిసి పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

డెంగీ ప్రబలకుండా ముందస్తు చర్యలు

కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

జిల్లాలో మలేరియా,డెంగ్యూ కేసులు వచ్చిన తదుపరి చర్యలు తీసుకోవడం కంటే, ప్రభలకుండా పూర్తిస్థాయిలో నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వైద్య శాఖ ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవలపై సమీక్షా సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు ప్రబలకుండా పెద్ద ఎత్తున పారిశుధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని తెలిపారు. రక్త నమూనాలను సేకరించి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణలో ప్రజలను భాగస్వామ్యులను చేయాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు, పారిశుధ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. దోమలు వృద్ధి చెందే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాధులు వ్యాప్తి కాకుండా పక్కా ప్రణాళికతో ముందడుగు వేయాలని ఆయన స్పష్టం చేశారు.

జిల్లాలో సికిల్‌సెల్ కార్డులు పంపిణీ పూర్తి చేయాలని, కార్డు ఉపయోగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలిపారు. తరువాత తరంలో సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టరు చెప్పారు. సికిల్ సెల్ కార్డులు ఉపయోగంపై ముందుగా వైద్య సిబ్బందికి తెలియాలని అన్నారు. 10-19 ఏళ్ల లోపు ఆడపిల్లలకు, గర్భిణులకు తప్పనిసరిగా ఎనీమియా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందించి ఎనీమియా రహిత జిల్లాగా మార్చాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో మాత, శిశు మరణాలు జరగరాదని, మృతికి కారణమయ్యే అధికారులు, సిబ్బంది పట్ల చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టంచేశారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితుల పట్ల పూర్తిగా సమాచారం ఉండాలన్నారు. గర్భిణులను ఆసుపత్రిలో చేర్చినపుడు సంబంధిత ఆసుపత్రి మంచి వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆసుపత్రిలో ఒక నెలలో జరిగిన ప్రసవాలు, అందులో హై రిస్క్ కేసులు విధిగా గుర్తించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఏ ప్రాంతంలో ఎక్కువ హై రిస్క్ కేసులు ఉంటాయో అటువంటి ప్రాంతాల్లో మరిన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రైవేట్ ఆసుపత్రులలో సేవ లపై కమిటిని నియమించి తనిఖీలు చేయాలని ఆదేశించడం జరిగిందని, వాటి వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. గర్భిణులను ప్రైవేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసినా, ఎఎన్‌ఎంలు తీసుకు వెళ్లినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ సమావేశంలో డిఎంహెచ్‌ఒ కె.విజయ పార్వతి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంటు బి.వాగ్దేవి, జిల్లా విద్యాశాఖాధికారి జి.పగడాలమ్మ, డిఎల్ఎటిఒ వినోద్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మద్యంషాపులకు దరఖాస్తు గడువు పెంపు

- 11 వరకు స్వీకరణ.. 14న లాటరీ
- ఒక్కరోజే వేల దరఖాస్తులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు స్వీకరించేందుకు మరో రెండు రోజులు గడువు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీని ప్రకారం ఈనెల 11వ తేదీ రాత్రి 7గంటల వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 11న తీయాల్సిన లాటరీ 14వ తేదీన తీయనున్నారు. 12,13తేదీల్లో దరఖాస్తుల పరిశీలించనున్నారు. ముందస్తు షెడ్యూల్ ప్రకారం బుధవారం నాటికి విజయనగరం జిల్లాలో 3,672, పార్వతీపురం జిల్లాలో 905 దరఖాస్తులు అందాయి. విజయనగరంలో రెండు స్టేషన్ల పకరిధిలో 746 దరఖాస్తులు వచ్చాయి. మరో రెండు రోజులు గడువు పెంచిన నేపథ్యంలో దరఖాస్తుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం కూడా ఆదాయమే లక్ష్యంగా గడువు తేదీ పెంచినట్టు చర్చనడుస్తోంది. బుధవారం ఒక్కరోజే విజయనగరం జిల్లాలో 1073, పార్వతీపురం మన్యం జిల్లాలో 329 చొప్పున దరఖాస్తులు అందడం గమనార్హం. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు కలిపి ఇప్పటి వరకు 4,577 దరఖాస్తులు అందాయి. ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల చొప్పున దరఖాస్తు ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.45.15కోట్ల మేర ఇప్పటివరకు ఆదాయం వచ్చింది. దరఖాస్తు దారుల్లో ఎక్కువ మంది రాజకీయ నాయకులకు చెందిన బినామీలు, ఇప్పటికే మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్న వారే ఉన్నట్టుగా తెలుస్తోంది.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కురుపాం

ప్రతిఒక్కరికీ సుఖవ్యాధులు, హెచ్ఐవిపై అవగాహన కలిగి ఉండాలని వైడిఒ నైట్‌వర్క్ ఔట్ రీచ్ వర్కర్ ఎ.గీతారాణి అన్నారు. బుధవారం కురుపాం పంచాయతీలోని రావాడ జంక్షన్‌లో మీకు తెలుసా? అనే కార్యక్రమం ద్వారా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఐవి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. హెచ్ఐవి సోకిన వారిని చిన్నచూపు చూడకుండా ఉండేలా ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని కోరారు.

సీతానగరం.. రైతులకు అవగాహన కల్పిస్తున్న విఎఎ

ఇ-కెవైసి తప్పనిసరి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ఇ-క్రాప్ నమోదు చేసుకున్న రైతులు ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి అశోక్ తెలిపారు. బుధవారం మండలంలోని వెంకంపేట పంచాయతీ కార్యాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మరికొద్ది రోజుల్లో పంట కోతలు మొదలవుతున్న దృష్ట్యా ఇ-కెవైసి తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. తెగుళ్లపై పలు రైతులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ టి.కృష్ణారావు, మాధవరావు, జాగాన రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలో రంగంపేట, పణుకుపేటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటల సమస్యలపై రైతులకు డిఆర్‌సి సహాయ వ్యవసాయ సంచాలకులు భారతి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఎస్.అవినాష్, గ్రామ వ్యవసాయ సహాయకులు జగదీష్. వాసు, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి కోరారు. బుధవారం పార్వతీపురం మండలం గంగాపురం పంచాయతీ పరిధిలోని తానవలసలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బడిదేవర కొండపై గ్రానైట్ అనుమతులు రద్దు చేసేంతవరకు పోరాడుదామన్నారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పోడుపట్టాలు సాధించుకోవాల్సి ఉందని చెప్పారు. ముందుగా సమావేశ ప్రాంగణాన్ని మెల్లక రాము, పాలమెట్ట రాము ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వరాలు, తాడంగి దుబ్బమ్మ, మెలక భాస్కరరావు, అద్రక చిరంజీవి, మెలక లక్ష్మణరావు, గొల్లది సింహాచలం, తాడంగి రాము, కొండగరి వెంకటి పాల్గొన్నారు.

గాజాపై దాడులు ఆపాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపాలని సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి పెదరాపు భాస్కరరావు, జిల్లా కమిటీ సభ్యులు పువ్వల భాస్కర్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. అమెరికా అండతో ఇజ్రాయిల్ గాజాపై దాడులు చేస్తుందన్నారు. విద్యాసంస్థలు, మసీదులు, ఆస్పత్రులపై దాడులు చేస్తూ మారణహోమం సృష్టిస్తోందని మండిపడ్డారు. ఏడాది పూర్తయినా ఇప్పటివరకు దాడులు ఆపలేదన్నారు. కార్యక్రమంలో జిఎల్‌పురం, కురుపాం, పాలకొండ మండల కార్యదర్శులు పి.జయరాం, జీలకర్ర సక్రు, బి.నాగేశ్వరరావు, అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పాలక సహదేవుడు, నాయకులు గ్రంధి సూర్యారావు, డి.సూర్యకళ, సిహెచ్ ఝాన్సీ, జామి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పట్టణంలోని 15వ వార్డులో బుధవారం చేపట్టిన వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ఎం.నారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. షెడ్యూల్ ప్రకారం టీకాకు అర్హులైన పిల్లలు, గర్భిణుల వివరాలు, గడువు తేదీలను టీకా కార్డుల్లోపరిశీలించారు. వ్యాక్సిన్ కాల పరిమితి తనిఖీ చేశారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంలో పిల్లల బరువు, ఎదుగుదల నమోదు రికార్డులు పరిశీలించారు. పిల్లలు పౌష్ఠికాహారం సరిగా తీసుకునేలా చూడాలన్నారు. పిల్లల్లో శ్వాస సంబంధమైన సమస్యలు, జ్వరం, మొదలగు వ్యాధులు గుర్తిస్తే వెంటనే తగు చికిత్స అందజేసి పర్యవేక్షించాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ జయగౌడు, ఎఎన్ఎం నారాయమ్మ, అంగన్వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భంజ్‌దేవ్‌ని కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-సాలూరు

మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్‌పి భంజ్‌దేవ్‌ని బుధవారం జనసేన నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు కలిశారు. భంజ్‌దేవ్ నివాసానికి వెళ్లిన జనసేన నాయకులు జర్జాపు ఈశ్వరరావు, సూరిబాబు కొద్దిసేపు నియోజకవర్గ రాజకీయాలపై చర్చించారు. ఇటీవల వైసిపిని వీడిన జర్జాపు సోదరులు జనసేన పార్టీలో చేరారు. వారి వెంట జనసేన నాయకులు జిటి నాయుడు, తదితరులు ఉన్నారు.

నేడు ఎమ్మెల్యేల అభినందన సభ

ప్రజాశక్తి-వీరఘట్టం

శ్రీకాకుళంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిరంలో గురువారం పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, కోండ్రు మురళీమోహన్‌కు అభినందన సభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర మీడియా కన్వీనర్ అన్ను వెంకటరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దళిత ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాల జెఎసి నాయకులు హాజరుకావాలని కోరారు.

మధుర స్మృతిగా నిలిచిపోవాలి

- ఉత్సవాల ప్రారంభానికి శాసనసభ స్పీకర్ రాక
- చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి శ్రీనివాస్

విజయనగరం ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎమ్మెల్యే, కలెక్టర్,ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగర ఉత్సవాలు ప్రతి ఒక్కరి మదిలో మధుర స్మృతిగా నిలిచిపోయేలా నిర్వహించాలని రాష్ట్ర ఎంఎస్ఎంఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఉత్సవాల ఏర్పాట్ల పై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఎమ్మెల్యే అదితి గజపతి రాజు,కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేస్తున్న మొట్ట మొదటి కార్యక్రమం అత్యంత ప్రతిష్టాత్మకంగా, వైభవంగా నిర్వహించాలని తెలిపారు. అధికారులు వారికీ కేటాయించిన విధులను జాగ్రత్తగా నిర్వహించి పండగను, ఉత్సవాలను విజవంతం చేయాలనీ తెలిపారు. అనధికార సభ్యులతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి లోటు పాట్లు లేకుండా పని చేయాలన్నారు. మొత్తం ఉత్సవ కార్యక్రమాలను డాక్యుమెంటేషన్ చేయాలని, ఎక్కడైనా పొరపాట్లు జరిగినా వచ్చే ఏడాదికి వాటిని సరి దిద్దుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ర్యాలీ, క్రీడలలో పాల్గొనే వారికీ, కళాకారులకు ప్రధానంగా బయట నుండి వచ్చే వారికీ భోజనం, వసతి, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రారంభ ర్యాలీకి రాష్ట్ర సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు విచ్చేస్తారని తెలిపారు. 11వ తేదీ సాయంత్రానికి నగరమంతా లైటింగ్ ఏర్పాట్లు జరగాలని ఆదేశించారు. ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్ర పండుగ గా జరుపుకుంటున్న అమ్మవారి జాతరను సమిష్టి కృషితో విజయవంతం చేయాలని తెలిపారు. ఉత్సవాల ద్వారా విజయనగరాన్ని ఒక పర్యాటక ప్రాంతంగా అభివద్ధి చేయడానికి మంచి అవకాశం లభిస్తుందన్నారు. పర్యాటక ప్రాంతంగా మారితే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. కలెక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ అన్ని వేదికలలో ఇంచార్జ్ అధికారులు లైఫ్ మెంబెర్లతో కలసి సమన్వయం చేసుకొని ఎలాంటి లోటు పాట్లు లేకుండా పని చేయాలని తెలిపారు. జిల్లా ఎస్.పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ఉత్సవాలకు, పండగకు 2 వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం త్సవాలకు సంబంధించిన పోస్టర్లను, కర పత్రాలను, బ్యానర్లను, టీజర్లను మంత్రిచేతుల మీదుగా ఆవిష్కరించారు. సమావేశంలో జెసి సేతు మాధవన్, డిఆర్ఒ అనిత, ఆర్‌డిఒ కీర్తి , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కార్యక్రమాల వివరాలు

- 13న అమ్మవారి గుడి నుంచి అయోధ్య మైదానం వరకు ప్రారంభోత్సవ ర్యాలీ. సాయంత్రం పెట్‌షో.
- 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు అయోధ్యా మైదానం లో మెగా ఈవెంట్‌తో పాటు జబర్దస్త్ వంటి వినోద కార్యక్రమాలు.
- కోట లో సైన్సు ఫేర్. 205 సైన్సు ప్రాజెక్టులు ప్రదర్శన.
- కోట వద్ద శ్రీ పైడి తల్లి అమ్మవారి జీవిత చరిత్ర, విజయనగర వైభవం పై లేజర్ షో ప్రదర్శన.
- గురజాడ కళాభారతి లో నాటికలు, ఏక పాత్రాభినయాలు
- విజ్జి స్టేడియంలో 5 రకాల క్రీడలు
- ఆనంద గజపతి ఆడిటోరియంలో సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు
- లేడీస్ రిక్రియేషన్ క్లబ్ లో కవి సమ్మేళనాలు, అష్టావధానాలు
- లయన్స్ క్లబ్ లో జానపద కళారూపాలు, బొంకుల దిబ్బ వద్ద 13న సత్య హరిశ్చంద్ర, 14న కన్యాశుల్కం నాటకాల ప్రదర్శన, పులి వేషాలు.
- లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర 11వ తేదీ నుంచి 20వ తేదీ వరకు డ్వాక్రా ఉత్పత్తుల ప్రదర్శన సరస్ , అదే వేదిక వద్ద పుష్ప ఫల ప్రదర్శన.

పిఎంఇజిపితో యువతకు ఉపాధి అవకాశాలు

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

ప్రజాశక్తి-పార్వతీపురం

ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమం (పిఎంఇజిపి) కింద యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన జారీ చేశారు. పిఎంఇజిపి కింద ఖాది విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కె.వి.ఐ.సి), ఖాది విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు (కె.వి.ఐ.బి), జిల్లా పరిశ్రమల కేంద్రం (డి.ఐ.సి), కాయర్ బోర్డ్ ద్వారా ఉపాధి అవకాశాలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లభిస్తాయని చెప్పారు యువత మైక్రో ఎంటర్ ప్రైజెస్ స్థాయిలో పరిశ్రమల స్థాపించుకునే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పథకాలకు ప్రభుత్వ రంగ, సహకార బ్యాంకులు, ప్రైవేట్ రంగంలో ఉన్న షెడ్యూల్ కమర్షియల్ బ్యాంకులు ఆర్థిక సహాయాన్ని అందిస్తాయని చెప్పారు. తయారీ రంగంలో పరిశ్రమలకు రూ.50 లక్షల వరకు, సేవారంగంలో రూ.20 లక్షల వరకు ప్రాజెక్టులకు రాయితీ మేరకు ఆర్థిక సహాయం లభిస్తుందని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాజెక్ట్ విలువకు మించిన ప్రాజెక్టులు ఉంటే రాయితీ లేకుండా బ్యాంకుల రుణాలు మంజూరు చేయగలరని పేర్కొన్నారు. తయారీ రంగ పరిశ్రమలకు 40 శాతం, సేవా రంగంలో ఉన్న పరిశ్రమలకు 60 శాతం మించి నిర్వహణ మూలధనం ఉండరాదని తెలిపారు. ఒక కుటుంబంలో ఒక వ్యక్తి ఇటువంటి రాయితీని పొందుటకు అర్హులని కలెక్టర్ వెల్లడించారు. క్యాబ్, మోటార్ కార్, బోటు తదితర రవాణా వాహనాలను సమకూర్చుకునే అవకాశం ఉందని చెప్పారు. పశు సంవర్ధక రంగంలో సైతం డైరీ, మిల్క్ అండ్ డైరీ ఉత్పత్తులు, పౌల్ట్రీ, సంబంధిత గుడ్లు, మాంసం, చికెన్ తదితర ప్రాజెక్టులను ఏర్పాటు చేసుకునే అవకాశం ఉందని ఆయన వివరించారు. పొగాకు, బీడీ, సిగరెట్ తదితర మత్తుమందులు, మాదగ ద్రవ్యాల వంటి పదార్థాలను తయారుచేసే పరిశ్రమలకు అనుమతులు ఉండవని స్పష్టం చేశారు. 75 మైక్రాన్ల కంటే తక్కువ మందం గల పాలిథిన్ సంచులు తయారీకి అనుమతించనున్నట్లు తెలిపారు. ఈ పథకం కింద అభ్యర్థి వయసు 18 సంవత్సరాలు పైబడి ఉండాలని, ఎటువంటి ఆదాయ పరిమితి లేదని, రూ.5 లక్షల దాటి తయారీ రంగంలో పరిశ్రమలకు, రూ.2 లక్షలు దాటిన సేవా రంగంలో పరిశ్రమలకు కనీసం ఎనిమిదో తరగతి చదివి ఉండాలని ఆయన చెప్పారు. ఆర్థిక రంగ సంస్థలు అందించే రుణాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ మహిళలు,ఎక్స్ సర్వీస్ మెన్, ట్రాన్స్ జెండర్స్, వికలాంగులకు పట్టణ ప్రాంతాల్లో 25 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం సబ్సిడీగా ఉంటుందని, 5 శాతం లబ్దిదారు వాటాగా భరించాలని చెప్పారు. ఇతరులకు పట్టణ ప్రాంతాల్లో 15 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 20 శాతం సబ్సిడీ ఉంటుందని లబ్ధిదారులు 10 శాతం తన వాటాగా ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల యువత ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

గెస్ట్ టీచర్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-పార్వతీపురం

మక్కువ మండలం పనసబద్ర ఏకలవ్య మోడల్ స్కూల్లో తెలుగు గెస్ట్ టీచర్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాతవ ఒక ప్రకటనలో చెప్పారు. తెలుగు సబ్జెక్టులో డిగ్రీ, బిఇడి చేసిన అభ్యర్థులు ఈ నెల 17లోగా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ఏకలవ్య మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

సీతంపేట : సీతంపేట ఐడిడిఎ పరిధిలో ఉన్న భామిని ఏకలవ్య మోడల్ పాఠశాలలో తాత్కాలిక పద్ధతిలో కెమిస్ట్రీ ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు పీజీ కెమిస్ట్రీలో 50 శాతం మార్కులు ఉండాలని తెలిపారు.

పట్టణ సమస్యలపై దృష్టిపెట్టాలి

- ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయ్‌చంద్ర

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణ ప్రజల సమస్యలపై మున్సిపల్ అధికారులు దృష్టిపెట్టాలని ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర సూచించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఉన్న కమిషనర్ చాంబర్‌లో పరిపాలన, ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రజారోగ్య, అకౌంటెంట్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆ శాఖల పరిధిలో సమస్యలను ప్రస్తావిస్తూ, వాటి పరిష్కారానికి ఎటువంటి చర్యలు చేపట్టాలి? అన్న అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుధ్యానికి ప్రాధాన్యత మరింత పెంచాలనే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా నిర్వహణపై ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని చెప్పారు. తాగునీటి సమస్య లేకుండా తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గత ప్రభుత్వం సామాన్య, మధ్యతరగతి ప్రజలపై విధించిన చెత్త పన్ను ప్రజలకు భారం కాకుండా దాన్ని రద్దుచేస్తూ కూటమి ప్రభుత్వం ఉపశమనం కలిగించిందని ఎమ్మెల్యే వివరించారు. వీధి దీపాల నిర్వహణ సక్రంగా ఉండాలని, ఎక్కడైనా లైట్లు పాడైతే తక్షణం వాటిని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పన్నుల విషయంలో ప్రణాళికాబద్ధంగా వెళ్లి పురపాలక ఆర్థిక పరిపుష్టికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి కమిషనర్ సన్యాసిరావు, మేనేజర్ లక్ష్మి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు జి.వినయ్‌కుమార్, బి.ఈశ్వరరావు, ప్రజారోగ్య అధికారి కె.పకీర్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇబ్బందులు పడుతున్న గర్భిణులు

గర్భిణులకు అవస్థలు

ప్రజాశక్తి-వీరఘట్టం

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇరుకుగా ఉండటంతో బుధవారం వైద్య పరీక్షల కోసం వచ్చిన గర్భిణులు అవస్థలు పడ్డారు. ప్రతి నెలా తొమ్మిదో తేదీన జరిగే ప్రధానమంత్రి మాతృ సురక్ష అభియాన్ కార్యక్రమానికి గర్భిణులు వచ్చినప్పుడల్లా ఇబ్బందులు తప్పడం లేదు. ఆసుపత్రి ఇరుకుతోపాటు సరైన సౌకర్యాలు లేకపోవడంతో ప్రతిరోజూ వైద్యం కోసం వచ్చే రోగులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

గ్రామంలో విచారణ చేపడుతున్న డిఎస్‌పి రాంబాబు

అట్రాసిటీ కేసుపై డిఎస్‌పి దర్యాప్తు

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని ఆడారు గ్రామంలో బుధవారం పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు దర్యాప్తు నిర్వహించారు. ఇదే గ్రామానికి ముచ్చుపల్లి హరి, భాను ఇంటిలో ఎవరూ లేని ఈ నెల 5న కర్రతో దాడి చేయడంతోపాటు కులం పేరుతో దుర్భాషలాడారని సరసంపల్లి యోగిందొర పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీంతో ఆ గ్రామంలో డిఎస్‌పి దర్యాప్తుచేశారు. కార్యక్రమంలో ఎస్ఐ జి.కళాధర్, గ్రామ పెద్దలు ఎన్.సత్యంనాయుడు, గణపతినాయుడు, తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి సంపూర్ణ సహకారం

ప్రజాశక్తి-సాలూరు రూరల్

ప్రకృతి వ్యవసాయం చేసే ప్రతి రైతుకూ సంపూర్ణ సహకారం అందించటానికి వ్యవసాయ అధికారులు సిద్ధంగా ఉంటారని జిల్లా వ్యవసాయ శాధికారి రాబర్ట్‌పాల్ తెలిపారు. బుధవారం మండలంలో మామిడిపల్లిలో సేంద్రియ పద్ధతుల్లో 5 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తున్న సువ్వడ గణేష్ వ్యవసాయ క్షేత్రాన్ని వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువ దిగుబడులు వస్తాయన్న ఆలోచనలతో మోతాదుకు మించి రసాయన ఎరువులు వాడటం వల్ల ఆ ప్రభావం మనిషి ఆరోగ్యంపై పడుతుందన్నారు. వ్యయం కూడా అధికమవుతుందని చెప్పారు. వ్యవసాయంలో నూతన విధానాలను అవలంబిస్తూ ఎరువులు, రసాయనాలు వాడకం తగ్గించి పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయడం వల్ల మంచి దిగుబడి, ధరలను కూడా పొందగలరని చెప్పారు. దీనిద్వారా ఆరోగ్య సమస్యలు కూడా రాకుండా ఉంటాయని తెలిపారు. గ్రామాలలో రైతులు ఒకరికొకరు ఈ విధానాన్ని పరిచయం చేసుకొని వ్యవసాయం చేయాలని సూచించారు. అప్పుడు అందరూ సేంద్రీయ సాగు పద్ధతులను ఆచరిస్తారని చెప్పారు. దీని కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి సాయం కూడా చేస్తున్నాయన్నారు. ఈ పద్ధతులను తెలియజేయడానికి క్లస్టర్లలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కూడా నియమించామని, రైతులకు కావలసిన సమాచారాన్ని వారు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో హార్టికల్చర్ శాస్త్రవేత్త శ్రీనివాసరాజు, సాలూరు ఎడి మధుసూదన రావు, జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి షణ్ముఖరాజు, ఎఒ అనురాధ పండా, ఎన్ఎఫ్ఎ శారద, యశోద, సత్యనారాయణ, రంగారావు, సూరిబాబు, లక్ష్మణ పాల్గొన్నారు.

సేంద్రీయ వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్

పంచాయతీల అభివృద్ధిలో అందరి భాగస్వామ్యం

ప్రజాశక్తి-కొమరాడ

పంచాయతీల అభివృద్ధిలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులు అందరూ భాగస్వామ్యం కావాలని ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిపి, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మల్లికార్జునరావు మాట్లాడుతూ సాధారణ కనీస పరిపాలన విధానం, పంచాయతీ రాజ్ చట్టం నిబంధనలపై శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం డిఆర్‌పి మహమ్మద్ రఫీ, ఇఒపిఆర్‌డి రాధాకృష్ణ, కార్యాలయ ఎఒ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ.. శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిపి శ్యామల

కురుపాం : పంచాయతీరాజ్ పాలనా వ్యవస్థపై ఉప సర్పంచులకు, వార్డు మెంబర్లకు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డిఎల్‌పిఒ జె.రామ్‌ప్రసాదరావు కోరారు. బుధవారం కురుపాంలోని వెలుగు కార్యాలయం వద్ద ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని డిఎల్‌పిఒ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధికి కీలకమైన పది అంశాలపై ఇస్తున్నటువంటి శిక్షణను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్పుడే పంచాయతీల పరిపాలన అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జెడ్‌పిటిసి జి.సుజాత, జి.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు తమ వంతు సహకారం అందించాలని ఎంపిడిఒ జి.పైడితల్లి తెలిపారు. ఎంపిడిఒ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు మెంబర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఎంపిడిఒ మాట్లాడారు. గ్రామసభలు నిర్వహిస్తున్న సమయంలో గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను చేపట్టేందుకు ప్రతిపాదనల తయారీలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు భాగస్వాములు కావాలని తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, కార్యాలయ ఎఒ అర్జునరావు, ఎపిఒ గౌరీనాథ్, పంచాయతీ కార్యదర్శులు తిరుపతి భాస్కరరావు, బంటు అప్పారావు, పువ్వల శిరీష, డి.దిలీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపిడిఒ త్రివిక్రమరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాబ్జీ, ఎంపిపి రమణమ్మ శ్రీరాములు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు జెడ్‌పిటిసి ఎ.రవికుమార్ హాజరయ్యారు.

కురుపాం.. మాట్లాడుతున్న డిఎల్‌పిఒ రామ్‌ప్రసాదరావు